

వయ్యారి గాలిపటం

జీవీరోడ్డు (విశాఖ): సాగరతీరంలో పతంగులు ఎగరేసి నగరవాసులు ఆనందంగా గడిపారు. సందడి చేశారు.



మన్యంలో సంబరం

పాడేరు: మన్యంలో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోయాయి. గిరిజనులు థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఉత్సాహంగా గడిపారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు



గ్రామీణ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాడి వీరభద్రరావు అన్నారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ

మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖప్రాంతీయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంగళ, బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారులు నిర్ణయించారు. పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మళ్లీ మెరిట్ లిస్టుకు తుది మెరుగులు దిద్ది శనివారం వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ అభ్యర్థుల ఎంపిక జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. మొత్తం ఆరు జిల్లాల అభ్యర్థులను ఎంపిక చేసి పోస్టింగ్ ఆర్డర్ ఇస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఉమా సుందరి చెప్పారు.

రద్దీగా ఉన్నరూట్లలో ప్రత్యేక బస్సులు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజి నీరు అప్పలనాయుడు

అల్లిపురం (విశాఖ దక్షిణ): సంక్రాంతి ముగిసిన తరువాత తిరుగు ప్రయాణానికి రద్దీగా ఉన్న రూట్లలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఆయన విశాఖపట్నం డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు మార్గమధ్యంలో ఎటువంటి అవాంతరాలు రాకుండా మెకానికల్ సిబ్బందికి, డ్రైవర్స్, కండక్టర్స్‌కు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు స్పెషల్ బస్సులు సక్రమంగా తిప్పినందుకు, మంచి ఆదాయం తెచ్చినందుకుగాను సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీరు ఎం.ఎస్.నాయుడు, స్టోర్స్ సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల దగ్ధంపై విచారణ

మద్రిపాలెం (విశాఖ): కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో వాహనాలు దగ్ధమైన సంఘటనపై విచారణ జరుపుతున్నట్టు డీసీపీ-2 ఆనందరెడ్డి తెలిపారు. ఆదివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్లో వాహనాలు 23వాహనాలు దగ్ధమయ్యాయి. దీనిపై ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పోలీస్ స్టేషన్ వెనుక.. జీవీఎంసీ డంపింగ్ యార్డ్‌లో కోర్టు డిస్పోస్డ్ వాహనాలు కాలిపోయినట్టు ఆయన తెలిపారు.

ఘనంగా పసిబిడ్డల తీర్థం



అమ్మవారి దర్శనానికి బిడ్డలతో వచ్చిన తల్లులు

రావికమతం: కొత్తకోట గ్రామంలో కనుమ పండగ సందర్భంగా ఆదివారం పసిబిడ్డల సంబరం ఘనంగా జరిగింది. రాంబయ్యమ్మ తీర్థంగా చెప్పే ఈ ఉత్సవానికి వారం రోజుల పసికందును సైతం తీసుకువస్తారు. ఆలయం చుట్టూ బిడ్డతో ప్రదక్షిణ చేసి అమ్మవారికి బిడ్డలను చూపించి సుఖసంతోషాలతో ఉండేలా బొట్టుపెట్టి తీసుకువెళ్తుంటారు. ఆదివారం జరిగిన ఈ సంబరానికి బిడ్డలతో పెద్ద ఎత్తున తల్లులు హాజరయ్యారు.

ఉమ్మడి విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య కార్యవర్గం

అనకాపల్లి టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లాల విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షునిగా డాక్టర్ మాటూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బొజ్జన్న కొండ వద్ద సోమవారం జరిగిన ఎన్నికల్లో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోర వేణు గోపాల్ గౌతమ్, కోశాధికారిగా పెయ్యిల సిద్ధార్థ, వర్కింగ్ అధ్యక్షునిగా నాగాబత్తుల బాలభాస్కరరావు, సీనియర్ ఉపాధ్యక్షులుగా మాటూరి శ్రీనివాసరావు, ఎం.బొడ్డు కల్యాణరావు, సహాయ కార్యదర్శులుగా కె.రాజుగణేష్, కుంచెల చినదేముడు, బల్లా నాగభూషణం, కొరమాటి అన్నవరం, కాకర నరసింహరాజు, గౌరవ సలహాదారులుగా కె.పి.వి.ప్రసాదరావు, బైపా అరుణ్‌కుమార్, జె.వి.ఝాన్సీలక్ష్మి, రావూరి విజయకుమార్, బీర రత్నకుమారి, చిడిపి సుబ్బారావుతోపాటు మరో 10మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాల్లో కొండలను అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

నేత్రపర్వం.. వెంకన్న గిరి ప్రదక్షిణం



స్వామి వెంట గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) పుణ్యకోటి వాహనంపై స్వామివారు

- ఉపమాక తరలివచ్చిన భక్తకోటి
- గరుడాద్రి చుట్టూ పోటెత్తిన భక్త జనం

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణ సోమవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. కల్కి అవతారంలో స్వామివారు స్వయం వ్యక్తమై కొలువుదీరిన గరుడాద్రి పర్వతం చుట్టూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా జరుపుతారు. ధనుర్మాసోత్సవాలు ముగిసిన అనంతరం ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో కనుమ నాడు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామిని పుణ్యకోటి వాహనంపై ఉంచి, గరుడాద్రి పర్వతం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచిన వాహనాన్ని మోసేందుకు వందలాది మంది భక్తులు పోటీపడ్డారు.

ఉత్సవమూర్తులను కడియం నుంచి తెచ్చిన పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం ఈ గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్వామివారితోపాటు వందలాదిమంది గరుడాద్రి పర్వతం చుట్టూ తిరిగారు. భక్తులు పెద్ద ఎత్తున అరటిగెలలు స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనడానికి నక్కపల్లి, ఉపమాక అడ్డురోడ్డు పరిసర ప్రాంత గ్రామాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. ఉపమాక శ్రీనివాస భక్తసమాజం సభ్యులు భజనగీతాలు ఆలపించారు.

ఈ సందర్భంగా ఉపమాకలో పెద్ద తిరునాళ్లు జరిగింది. ఉపమాక, సారిపల్లిపాలెం, పెట్టుగోళ్లపల్లి, మనబానవానిపాలెం, జానకయ్యపేట, తదితర గ్రామాల నుంచి తోడపెద్దులను తీసుకువచ్చి చెట్టు భజనలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. టీటీడీ వారు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకస్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకటశేషాచార్యులు, గోపాలాచార్యులు, నల్లాని చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు,న రసింహాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరంతా సంక్రాంతి

సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా జిల్లా అంతటా ఆనందోత్సాహాల మధ్య పండగ చేసుకున్నారు. కనుమ సందర్భంగా సోమవారం గోపూజ చేశారు. ముఖ్యంగా వ్యవసాయదారులు ఈ పండగను విశేషంగా జరుపుకున్నారు. గ్రామాల్లో తీర్థాల సందడి మొదలైంది. రంగులరాట్నాలు, ఆటపాటలతో ఎక్కడ చూసినా కోలాహలం నెలకొంది. పిల్లలు, మనుమల రాకతో ప్రతి ఇంటా ఆనందం తాండవించింది. ఈ ఏడాది పంటలు బాగా పండడంతో పల్లెలు కళకళలాడాయి. ఎడ్ల బళ్ల పోటీలు, గుర్రం పందేలు ఉత్సాహంగా జరిగాయి.

బొజ్జన్నకొండ తీర్థానికి పోటెత్తిన జనం శంకరం పంచాయతీలో ఉన్న బొజ్జన్నకొండ వద్ద సోమవారం ఘనంగా తీర్థం జరిగింది. కనుమ సందర్భంగా ప్రతి ఏడాది జరిగే బొజ్జన్న తీర్థంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. తుమ్మపాల నుంచి ఏలేరు కాలువ మీదగా.. శంకరం నుంచి బొజ్జన్నకొండ వరకూ జనం పొటెత్తారు. అనకాపల్లి రూరల్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా సాగింది.

– అనకాపల్లి టౌన్



కిక్కిరిసిన బొజ్జన్నకొండ మెట్ల మార్గం



బొజ్జన్నకొండ తీర్థంలో జనసందోహం



అనకాపల్లి గవరపాలెం శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవాలయంలో గోపూజ

వందేభారత్ సందడి



వందేభారత్ రైల్లో ప్రయాణిస్తున్న ఎంపీ సత్యవతి, డీఆర్ఎం సత్పతి



సోమవారం ఉదయం విశాఖ నుంచి బయలుదేరిన వందేభారత్

- స్పెషల్ రైలుకు ఘన స్వాగతం
- విశాఖ నుంచి తొలి ప్రయాణం

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర)/అనకాపల్లి టౌన్: వందేభారత్ స్పెషల్ రైలుకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం దక్కింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరగ్గా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రాజమండ్రికి ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఈ రైలు చేరుకోగా.. అప్పటికే విశాఖ నుంచి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆధ్వర్యంలో ప్రత్యేక స్పెషల్ రైలులో వెళ్లిన రైల్వే అధికారులు, ట్రైనీలు, వాల్తేరు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, మీడియా ప్రతినిధులు అక్కడ ఎక్కారు.

ఈ స్పెషల్ రైలు ద్వారపూడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతూ ప్రజా ప్రతినిధుల స్వాగత, వీడ్కోలు మధ్య రాత్రి 11 గంటల సమయంలో విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఇటీవల వాల్తేరు కేంద్రీయ విద్యాలయంలో రైల్వేకు సంబంధించి వివిధ అంశాలపై పలు ప్రత్యేక పోటీలు నిర్వహించగా.. అందులో విజేతలైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు రైలులోనే డీఆర్ఎం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. రైల్వేస్టేషన్‌లో ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రారంభోత్సవ రైలుకు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచిన ప్రజలకు, ప్రయాణికులకు, చాక్లెట్స్, బిస్కట్స్ పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు.

దువ్వాడ వరకు ఎంపీ సత్యవతి ప్రయాణం

వందేభారత్ స్పెషల్ రైలుకు అనకాపల్లి స్టేషన్‌లో ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి స్వాగతం పలికారు. ఆమె ఈ స్పెషల్ రైలులో దువ్వాడ వరకు ప్రయాణించారు. అనకాపల్లి స్టేషన్ మేనేజర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ నుంచి ఉదయం 5.45 గంటలకు ప్రారంభం

వందేభారత్ రైలు సోమవారం నుంచి రెగ్యులర్‌గా నడుస్తోంది. విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) మధ్య నడిచే వందేభారత్ రైలు విశాఖపట్నంలో సోమవారం ఉదయం 5.45 గంటలకు బయల్దేరింది. ఇది మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంది.

ఈ రైలు తిరుగు ప్రయాణంలో (20834) సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. ఈ రైలు రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ స్టేషన్లలో మాత్రమే ఆగుతుంది.

చలికి బ్రేక్!



- సాధారణంకంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- క్రమంగా పెరగనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు
- ఆగ్నేయ, దక్షిణ గాలులే కారణం

సాక్షి, విశాఖపట్నం: సాధారణంగా ఏటా సంక్రాంతికి చలి వణికిస్తుంది.అతి శీతలంతో జనాన్ని గజగజలాడిస్తుంది. సాధారణంకంటే 2–4 డిగ్రీలు తక్కువగా రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు నమోదవుతూ చలి తీవ్రతను పెంచుతాయి. ఇలా వణికించే చలి నుంచి ఉపశమనం పొందడానికి మంటలు వేసుకుంటారు. దుప్పట్లు కప్పుకుని ఊరట చెందుతారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికే వెనకడుగు వేస్తారు. సాయంత్రం మొదలైన అతి శీతలం మర్నాడు ఉదయం పొద్దెక్కే వరకూ కొనసాగుతూనే ఉంటుంది. ఇలా ఏళ్ల తరబడి సంక్రాంతికి కనిపించే వాతావరణ పరిస్థితి. విశాఖలో భోగి ముందు రోజు వరకు ఒకింత చలి ప్రభావం కనిపించింది. కానీ సంక్రాంతి నుంచి చలి ఛాయలు అంతగా కనిపించడం లేదు. చలి గజగజ వణికించడం లేదు. జనాన్ని గదులకే పరిమితం చేయలేదు. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువకు బదులు ఒకింత ఎక్కువగా నమోదవుతూ చలి తీవ్రతను తగ్గించాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 1–2 డిగ్రీలు ఎక్కువగా రికార్డవుతున్నాయి. జనవరి మూడో వారం ఆరంభం నాటికి విశాఖలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా 17–18 డిగ్రీల మధ్య నమోదవుతాయి. కానీ ఇప్పుడు 19–20 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి. ఇవి సాధారణంకంటే 2–3 డిగ్రీలు అధికంగా రికార్డవుతున్నాయి. దాదాపు వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విశాఖ నగరంలో గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు దాదాపు 32 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో పగటి వేళ ఎండ ప్రభావం చూపుతోంది.

ఎందుకిలా?

నాలుగైదు రోజుల క్రితం వరకు ఈశాన్య, ఉత్తర గాలులు వీచాయి. ఫలితంగా విశాఖలో 15–17 డిగ్రీల మధ్య రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలి ప్రభావం అధికంగా చూపింది. ప్రస్తుతం దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. దక్షిణ, ఆగ్నేయ గాలులు సముద్రంపై నుంచి వీస్తుండడం వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదపడుతున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు ‘సాక్షి’కి చెప్పారు. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ఆ తర్వాత మళ్లీ రాత్రి ఉష్ణోగ్రతలు ఒకింత తగ్గే అవకాశాలున్నాయన్నారు. అలాగే తేలికపాటి పొగమంచు కూడా ఏర్పడుతుందని తెలిపారు.

దారుణ హత్య



కాలువ నుంచి శరీర భాగాలు సేకరిస్తున్న పోలీసులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం అధికారులు

- కాలువలో వేరు చేసిన శరీర భాగాల గుర్తింపు
- కట్టుపాలెం చెరకు కాటా వద్ద కలకలం
- హతుడి వివరాలు, హంతకుల ఆచూకీ కోసం ముమ్మర దర్యాప్తు

యలమంచిలి: పట్టణానికి సమీపాన కట్టుపాలెం చెరకు కాటా వద్ద వంతెన కింద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి శరీర భాగాలు తేలడంతో కలకలం రేగింది. దీనిని గుర్తించిన స్థానికులు పోలీసులకు తెలపగా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ షేక్ గఫూర్, ఎస్సై సన్నిబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్, డాగ్ స్క్వాడ్లు వచ్చి శరీర భాగాలను కాలువలో నుంచి బయటకు తీయించి ఆధారాలు సేకరించారు. డీఎస్పీ శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ మృతదేహం 45 సంవత్సరాల పురుషుడిదని చెప్పారు. ఎవరైనా అదృశ్యమైతే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక వీర్వో మంగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి.. హతుడి వివరాలు, హంతకుల ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పర్యాటక బౌద్ధ కేంద్రంగా బొజ్జన్నకొండ



బొజ్జన్నకొండపై స్థూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న వెనరబుల్ ఆయుపాల మహాథేరో, హోషిత



బౌద్ధ భిక్షువుల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సమాఖ్య అధ్యక్షుడు మాటూరి శ్రీనివాస్

అనకాపల్లి టౌన్: స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో బొజ్జన్న కొండపై దశల వారీగా అభివృద్ధి జరుగుతోందని విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మాటూరి శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బొజ్జన్న కొండ దిగువన సోమవారం బౌద్ధ మేళా జరిగింది. మయన్మార్ దేశం బౌద్ధ భిక్షువు వెనరబుల్ ఆయుపాల మహాథేరో, అరుణాచల్‌ప్రదేశ్ బౌద్ధ భిక్షువు హోషితలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొండ దిగువ భాగం నుంచి బౌద్ధ పతాకంతో కొండపై గల ప్రధాన స్థూపం వరకు శాంతి ఊరేగింపు నిర్వహించారు. గుహలో ప్రధాన స్థూపం వద్ద పుష్పాంజలి, బుద్ధ వందనం, దమ్మదీక్ష నిర్వహించారు. బౌద్ధ భిక్షువులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులు రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.30 లక్షలతో కొండ చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని కొండను పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. సమీపంలో ఉన్న కొండలపై బ్లాస్టింగ్‌లు జరగడంతో బొజ్జన్న కొండలో స్థూపాలు పాడైపోతున్నాయన్నారు. అనంతరం బుద్ధ భూమి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని కారు

- యువకుడి మృతి, మరొకరికి గాయాలు




మృతుడు జుబెరుద్దీన్ గాయపడిన అలీ

నక్కపల్లి: స్థానిక ఆర్చి వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై విశాఖపట్నం బయలు దేరారు. తిరుగు ప్రయాణంలో సోమవారం సాయంత్రం నక్కపల్లిలో ఉపమాక రోడ్డు ఆర్చి వద్దకు చేరుకునే సరికి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న జుబెరుద్దీన్(16) అక్కడికక్కడే మరణించాడు. సయ్యద్‌అలీ గాయపడ్డాడు. ఇతడిని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు.

హాకీ పోటీలలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

- బాలుర జట్టుకు ప్రథమ స్థానం
- బాలికల జట్టుకు తృతీయ స్థానం

యలమంచిలి : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్ బాలురు, బాలికల హాకీ పోటీలలో అనకాపల్లి జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. జనవరి 11 నుంచి 13వ తేదీ వరకు ఏలూరు, నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో అనకాపల్లి జిల్లా నుండి ప్రథమంగా హాకీ జట్టు విజయం సాధించిందని అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ వీరునాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలను రాష్ట్ర హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.వి.రెడ్డి, ఎమ్మెల్యే కన్నబాబు రాజు, ఎంపీపీ గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, జిల్లా హాకీ అసోసియేషన్ కో–ఆర్డినేటర్ నరేష్, కోచ్ రమేష్, రాంబాబు, సాయిమహేష్ తదితరులు అభినందించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు రానున్న పోటీల్లో మరింత ఉత్తమ ప్రదర్శన కనబర్చి విజయం సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

పొగమంచుతో జర భద్రం

- మామిడి, జీడిమామిడి పూత దశ కీలకం
- డివిజన్ హార్టీకల్చర్ అధికారి ఎన్. రమేష్‌బాబు సూచనలు
- డివిజన్‌లో 15వేల హెక్టార్లలో జీడిమామిడి



రాజవొమ్మంగి పరిసరాల్లో కనుపిస్తున్న బంగినపల్లి మామిడి పూత (ఇన్‌సెట్) రంపచోడవరం డివిజన్ ఉద్యానవనశాఖాధికారి రమేష్‌బాబు

రాజవొమ్మంగి: అత్యధిక వాణిజ్య విలువలు, ఆదాయ వనరులు సమకూర్చే పంటల్లో మామిడి, జీడిమామిడి ప్రధానమైనవి. ఏజెన్సీలో మామిడి కన్నా జీడిమామిడి ఎక్కువగా సాగవుతోంది. మామిడి కన్నా జీడిమామిడికి మార్కెట్ సదుపాయం ఉండడంతో ఎక్కువగా జీడి మామిడిపైనే గిరిరైతు ఆధారపడుతున్నాడు. అయితే ఈ పంటలు అధిక దిగుబడులు ఇవ్వాలంటే పూత దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. రంపచోడవరం డివిజన్ ఏడు మండలాల్లో జీడిమామిడి 15వేల హెక్టార్లలో జీడిమామిడి (35వేల ఎకరాలు), అతి స్వల్పంగా 500 హెక్టార్లలో (1250 ఎకరాలు) మామిడి సాగవుతున్నాయి. కాగా పూత దశలో జీడి మామిడి, మామిడి దిగుబడులను పెంచుకొనేందుకు, లాభాలు ఆర్జించేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రంపచోడవరం డివిజన్ హార్టీకల్చర్ అధికారి ఎన్. రమేష్‌బాబు వివరించారు. శీతాకాలంలో పూతకు వచ్చే మామిడిపై వాతావరణం, ఉష్ణోగ్రతల తగ్గుహెచ్చులు, దట్టమైన పొగ మంచు ప్రభావం అధికంగా ఉంటుంది. దీనితో పూత వచ్చినా ముడుచుకొని పోయి దిగుబడి భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. అనాఫ్తలిన్ అసిటిక్ ఆమ్లాన్ని స్పిరిట్‌లో కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల పూత పూర్తిగా విచ్చుకొని పిందెలు కట్టే అవకాశం ఉంది. ఏ మాత్రం అవకాశం ఉన్నా పూత దశలో మామిడి చెట్లకు నీటి తడులు ఇస్తే పూత నిలబడి అధిక దిగుబడులు సాధించవచ్చు.

జీడిమామిడిపై..

జీడిమామిడిలో పూత మూడు సార్లు వస్తుంది. మొదటి విడతలో నవంబర్–డిసెంబర్ మధ్యలో, జనవరి– ఫిబ్రవరిలో మరోసారి, చివరిలో మార్చి నెలలో కూడా పూత వస్తుంది. ప్రధానంగా జనవరి–ఫిబ్రవరిలో వచ్చే పూతపైనే రైతులు దష్టి సారించాల్సి ఉంటుంది. పూతను సంరక్షించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు రంపచోడవరం డివిజన్ హార్టీకల్చర్ అధికారి ఎన్. రమేష్‌బాబు పలు సూచనలు అందించారు. ఇందుకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్ల మందు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్లపై పిచికారీ చేయాలని తెలిపారు. జనవరి–ఫిబ్రవరి నెలల్లో లామ్డాసైహాలోత్రిన్ 0.6 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మూడవ దఫా ప్రొఫెనోఫాస్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. కాయ దశలో నల్లని మచ్చలు వచ్చేందుకు కారణమయ్యే తామర పురుగులు, రసం పీల్చేపురుగుల నివారణకు లామ్డా సైహాలోత్రిన్ లేదా కాన్ఫిడార్, లేదా ఫిప్రోనిల్ అనే మందులలో ఒకదానిని పిచికారీ చేయాలని సూచించారు. కాయ దశలో నీటి తడులు మంచి దిగుబడిని ఇస్తాయన్నారు.

శేషతల్ప వాహనంపై తిరువీధి సేవ

- ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి
- ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రత్యేక పూజలు



శేషతల్ప వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో సంక్రాంతి నాడు ప్రత్యేక పూజలు జరిగాయి. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారమైన స్వామివారి మూలవిరాట్‌కు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు పంచామృతాలతో ప్రత్యేకాభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్యార్చనలు పూర్తి చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన వేణుగోపాల స్వామి ఆలయంలోను, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను స్వామి వారు ఉత్సవమూర్తుల వద్ద నిత్య సేవాకాలం, ప్రసాద నివేదన నిత్యహోమం, బలిహరణలు, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ గోష్టి జరిగాయి. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా పద్మావతి, అలమేలుమంగా సమేతుడైన వేంకటేశ్వర స్వామివారిని శేషతల్ప వాహనంలో వేంచేయింపజేసి గ్రామ మాఢవీదుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. హిందూ ధర్మప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల సంకీర్తనలు, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సెల్‌ఫోన్ దొంగల కొత్త అవతారం

- బైక్ నుంచి పడిపోయినట్టు నటన
- రక్షించిన వారి జేబులు గుల్ల

కోటవురట్ల: ప్రమాదం జరిగినట్టు నటించి, రక్షించడానికి వచ్చిన వారి సెల్‌ఫోన్లు లాక్కొని యువకులు పరారైన ఉదంతమిది. ఈ సంఘటన సోమవారం పొద్దుపోయాక తాళ్లపాలెంలో జరిగింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం... ఇద్దరు వ్యక్తులు బైక్‌పై నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం వైపు వస్తూ మండలంలోని జి.భీమవరంలో రోడ్డు పక్క కింద పడిపోయారు. అక్కడే ఉన్న తాతాజీ వారిని లేవదీసే ప్రయత్నం చేయగా ఇదే తడువుగా అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను తస్కరించి బైక్‌పై తాళ్లపాలెం వైపు పరారయ్యారు. తాతాజీ తేరుకొని వెంటనే తాళ్లపాలెంలో తమకు తెలిసిన వ్యక్తికి ఈ విషయం ఫోన్లో తెలియజేసి ఆగంతకుల పోలికలను వివరించారు. తాళ్లపాలెంలో మాటు వేసిన అతని స్నేహితుడు.. ఆ సమయంలో అటుగా వస్తున్న బైక్‌ను అనుమానించి నిలిపాడు. దీంతో నిందితులు బైక్ వదిలి పారిపోయారు. బైక్‌ను స్వాదీనం చేసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ బైక్‌కు నెంబర్ లేదని సమాచారం. ఇదే తరహాలో గతంలో కూడా ఇక్కడ సెల్‌ఫోన్ దొంగతనం జరిగిందని స్థానికులు తెలిపారు. బైక్‌లపై వచ్చి జేబుల్లో సెల్‌ఫోన్, నగదు ఉండటాన్ని గమనించి కింద పడిపోతున్నట్లు నటిస్తూ ఆగంతక యువకులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఇటువంటివి పునరావృతం కాకుండా పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రామలింగస్వామి సేవాపురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్ : జన్మించిన ప్రతి వ్యక్తి నాలుగు ధర్మాలను పాటించిన వ్యక్తులు మరణించినా సమాజంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సీబీఐ మాజీ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక పాతబస్‌స్టాండ్ చంద్రశేఖర్ కల్యాణమండపంలో శనివారం రాత్రి స్వర్గీయ డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవాపురస్కారాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. వ్యక్తి,వృత్తి, సామూహిక, సామాజిక నాలుగు ధర్మాలు పాటించిన వ్యక్తులు మరణించినప్పటికీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవడం జరుగుతుందన్నారు. ఈ ధర్మాలను పాటించి మానవునిగా జన్మించి, శాస్త్రవేత్తగా రామలింగస్వామి ఎదగడం ఎంతో ఆనందాన్ని ఇవ్వడం జరిగిందని, రామలింగస్వామి మరణానంతరం భార్య లక్ష్మీపార్వతి తనకు వచ్చిన ప్రభుత్వ పింఛనుతో ట్రస్టును ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలుగా ప్రతీ ఏడాది భోగి రోజు సేవా పురస్కారాలను అందజేయడం శుభ పరిణామని, ఈ ఏడాది ఉమ్మడి రాష్ట్రంలో ఆరుగురుకి సేవా అవార్డులు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కె.ఫణిభూషన్ శ్రీధర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ ఇన్‌చార్జి జేడీగా విజయ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): మత్స్యశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్‌గా జి.విజయ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న టి.సుమలతను కాకినాడలో స్టేట్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారు.

ముురిపించిన మందారం



ఎరుపు మందారపువ్వుపై ఆకర్షణీయంగా కనిపిస్తున్న పసుపు వర్ణం

- ఎరుపు, పసుపు రంగులతో పూలరేకులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో ఎరుపు మందార చెట్టుకు పూచిన పూలకు పసుపు వర్ణంతో కూడిన కొన్ని రేకులు ఆకట్టుకుంటున్నాయి. ఓ ఇంటి పెరట్లో రంగురంగుల మందార పూల చెట్లు ఉన్నాయి. కాగా పసుపు వర్ణంతో పూచే మందార చెట్టును ఆనుకొని ఉన్న ఎర్ర మందార చెట్టుకు పూచిన పూల రేకులపై అక్కడక్కడా పసుపు వర్ణం స్థానికులను ఆకర్షిస్తోంది. హైబిస్కస్ రోసా అనే శాస్త్రీయ నామం గల మందార పూలు ఫలదీకరణం చెంది ఇలా ఒకే చెట్టుకు రెండు మూడు రంగుల్లో పూలు పూస్తాయని హార్టీకల్చర్ నిపుణులు చెబుతున్నారు.

కల్వర్టు వద్ద గోతిలో పడి బైకిస్ట్‌కు తీవ్ర గాయాలు

- విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి



కల్వర్టులో పడి తీవ్ర గాయాల పాలైన వీర రాఘవులు

రావికమతం: టి.అర్జాపురం వద్ద రోడ్డు కల్వర్టు నిర్మాణం వద్ద బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ విశాఖలో మృతి చెందాడని కొత్తకోట ఏఎస్‌ఐ గోవిందరావు సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు... కోటవురట్లకు చెందిన గట్టి వీరరాఘవులు తన గ్రామం నుంచి రావికమతం వెళ్తూ ఆదివారం రాత్రి టి.అర్జాపురం కల్వర్టు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఇక్కడ ఎటువంటి రేడియం హెచ్చరిక స్టిక్కర్లు లేకపోవడంతో బైక్‌పై వెళ్తున్న అతడు నేరుగా గోతిలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో నర్సీపట్నం ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు దేవరశెట్టి కాశీప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. బీఎన్‌రోడ్డులో టి.అర్జాపురం నుంచి రావికమతం మధ్య నిర్మిస్తున్న ఆరు కల్వర్టుల వద్ద సదరు కాంట్రాక్టర్ ఎటువంటి హెచ్చరిక బోర్డులుగానీ కనీసం రేడియం స్టిక్కర్లుగానీ ఏర్పాటు చేయక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు



దౌడు తీస్తున్న ఎడ్లు



ఎడ్లబళ్ల పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

మునగపాక: గ్రామీణ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తెలుగు రైతు, గౌరీ యూత్ ఆధ్వర్యంలో మునగపాక బైపాస్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పాడిని నమ్ముకున్న రైతులను ప్రోత్సహించాలన్నారు. సంక్రాంతి సందర్భంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా రైతుల్లో ఆత్మ విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి నరసింగరావు, ఆడారి గోవింద, కోరుకొండ ప్రసాద్, వెలగా మురళి, పెంటకోట శ్రీరామమూర్తి, వేగి రమణబాబు, వేగి కుమార్ పాల్గొన్నారు.

నర్సాపురం ఎడ్లబండికి ప్రథమ బహుమతి...

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల విజేతగా నర్సాపురానికి చెందిన సంపత్ వినాయక ఎడ్ల బండి నిలిచింది. చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ ఎడ్ల బండి ద్వితీయ, తుమ్మికాపల్లికి చెందిన జై దర్శిన్ ఎడ్లబండి తృతీయ, చుక్కపల్లికి చెందిన రాజేష్ ఎడ్ల బండి చతుర్థ బహుమతులు కైవసం చేసుకున్నాయి. విజేతలకు టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీష్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

మూడు పూరిళ్లు దగ్ధం



ఛటర్జీపురంలో కాలిపోయిన తమ ఇంటి వద్ద బాధిత కుటుంబం

రోలుగుంట: మండలంలో వేర్వేరు అగ్నిప్రమాదాల్లో మూడు పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. ఆదివారం జె.పి.అగ్రహారం, ఛటర్జీపురం గ్రామాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా జె.పి.అగ్రహారంలో చిరికి పెంటమ్మ తన ఇంట్లో మూలపూజ చేసి జ్యోతి వెలిగించి బయటకు వచ్చేసి పొరుగువారి మాటల్లో పడింది. దీంతో వెలుగుతున్న జ్యోతి వద్ద కొత్త దుస్తులకు మంటలు అంటుకుని వ్యాపించడంతో సామగ్రితోపాటు తాటాకు ఇల్లు కాలిపోయింది. రూ.8 వేలు, వృత్తిపరంగా అల్లిన చాపలు, వంట సామగ్రి దగ్ధమయ్యాయి. దీంతో బాధితురాలు తన భర్త రాజబాబుతో కలసి నష్ట పరిహారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు.

మరో ఘటనలో...

ఎం.కె.పట్నం శివారు ఛటర్జీపురంలో మురికుట్టి అప్పలనాయుడు తాటాకు ఇల్లు ఆదివారం రాత్రి కాలి బూడిదైంది. దీనిపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి... అతడు ఎప్పటి మాదిరిగానే తన మేకలను మేత కోసం తోలుకెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. రాత్రికి భార్య రాజు ఇద్దరూ భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి నిద్రలేచి అప్పలనాయుడు బయటకు వచ్చాడు. ఆ సమయంలో మాకవరంపాలెం మండలం గిడితూరు గ్రామానికి చెందిన రేఖా పోతురాజు తన ఇంటికి నిప్పుపెట్టి పారిపోతుండగా, అతడ్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా, తప్పించుకుపోయాడు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చేసరికి ఇంటితోపాటు పొరుగు ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో టి.వి, దుస్తులు, సామగ్రి, కొంత నగదు కాలిపోయింది. పక్కింట్లో సామగ్రితోపాటు రాజులమ్మ కుమార్తెవి విద్యార్హత ధ్రువపత్రాలు కాలిపోయాయి. తనపై కక్షసాధింపుతోనే బాధ్యుడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని, విచారించి నష్ట పరిహారం ఇప్పించి తగిన శిక్ష విధించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సముద్రంలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి



మృతి చెందిన ప్రేమ్‌సన్ (ఫైల్)

పాయకరావుపేట: మండలంలోని పెద్దూరు రత్నయ్యమ్మపేట సముద్ర తీరంలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందాడు. సీఐ పి.అప్పలరాజు వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన త్రిపురాలు ప్రేమ్‌సన్ (19), తొండంగి మండలం కృష్ణాపురంలో తన మేనమామ తిరగట్టి నాని బాబు ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి ఆదివారం సముద్ర తీరంలో స్నానానికి స్నేహితులతో వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేస్తుండగా, సముద్ర అలలు తాకిడికి లోపలికి కొట్టుకుపోయాడు. ఈత రాకపోవడంతో సముద్రంలో గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం వెంకటనగరం బీచ్‌లో మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లక్ష్యవర్మ మృతదేహం లభ్యం

పరవాడ: అచ్యుతాపురం మండలం తంతడి బీచ్‌లో ఈ నెల 13న ఈతకు దిగి గల్లంతైన యువకుడు లక్ష్యవర్మ మృతదేహం తిక్కవానిపాలెం తీరంలో ఆదివారం లభ్యమైందని సీఐ పి.ఈశ్వరరావు సోమవారం తెలిపారు. అనకాపల్లికి చెందిన యువకుడు లీలా ప్రశాంత్, ఢిల్లీకి చెందిన యువకుడు లక్ష్యవర్మ(14) తంతడి తీరంలో స్నానానికి దిగి ఈత కొడుతున్న క్రమంలో బలమైన కెరటాలకు ఇద్దరూ లోపలికి కొట్టుకుపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానిక మత్స్యకార యువకులు గల్లంతైన అనకాపల్లి యువకుడు లీలా ప్రశాంత్‌ను కాపాడినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే మృతి చెందాడు. మరో యువకుడి మృతదేహం తిక్కవానిపాలెం తీరానికి చేరింది. ఇద్దరి మృతదేహాలకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు.

అపురూపం.. అద్వితీయం



మాడుగులలో ఒకే కుటుంబ సభ్యులు కలిసిన దృశ్యం

- మాడుగులలో ఒకే కుటుంబానికి చెందిన 65 మంది ఆత్మీయ కలయిక

మాడుగుల రూరల్: సమాజంలో రోజు రోజుకు బంధాలు, బంధుత్వాలు పలచబడుతున్న ఈ తరుణంలో మూడు తరాలకు చెందిన ఒకే కుటుంబం ఒకచోట కలుసుకుని ఆత్మీయ అనుభూతి పొందింది. కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు, చిన్నపిల్లలతో కలిపి మొత్తం 65 మంది ఆత్మీయ కలయికతో సందడి వాతావరణం నెలకొంది. వీరంతా మాడుగులలో ఆది, సోమవారాల్లో భోగి, సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. మాడుగుల పెరుమాళ్ల వీధికి చెందిన రాకుర్తి సూర్యనారాయణ, నారాయణమ్మ దంపతులకు కుమారులు, కుమార్తెలు కలిపి 9 మంది ఉన్నారు. వీరికి వివాహాలై వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి సందర్భంగా కుటుంబ పెద్ద నారాయణమ్మ పాదాలకు క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సంక్రాంతి రోజున ఒకే చోట కలుసుకోవడం ఆనందగా ఉందని రాకుర్తి కుటుంబ సభ్యులు తెలిపారు.



తారువలో మర్లమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకొని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న స్థానిక బూడి యూత్ సభ్యులు-దేవరాపల్లి

క్లుప్తంగా

భోగలింగేశ్వరస్వామి ఆలయంలో గోపూజ

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం కనుమ పండగను పురస్కరించుకుని గోపూజ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానఅర్చకులు పేరూరి చిన్నిస్వామి మాట్లాడుతూ సంక్రాంతి రోజుల్లో పశుపక్షాదులను పూజించే సంప్రదాయం అనాదిగా వస్తోందని, ఈ రోజు ముక్కోటి స్వరూపమైన గోమాతకు శ్రీసుక్త విధానంగా కుంకుమపూజలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదినారాయణ, భక్తులు పాల్గొన్నారు.

మండల అత్యవసర సమావేశం నేడు

కశింకోట: మండల అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

కోడిపందాలపై దాడి

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామం శివారులో నగదు పణంగా పెట్టి కోడి పందాలు ఆడుతుండగా సోమవారం దాడి చేసి పట్టుకొని ఇద్దర్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గొంతిన ప్రసాద్, బొమ్మిశెట్టి కృష్ణలను అరెస్టు చేశామన్నారు. రెండు పందెం కోళ్లను, రూ.410 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

పూలపల్లకీలో అయ్యప్ప ఊరేగింపు


ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మునగపాక : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఆదివారం ఘనంగా జరిగింది. మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా అయ్యప్ప ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో అన్ని వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా తయారు చేసిన పూల పల్లకిలో అయ్యప్పస్వామిని మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 7,841 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,060
మొదటి రకం	2,980	3,410
రెండో రకం	2,820	2,070
మూడో రకం	2,800	2,940

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వాల్తేరు వీరయ్య	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
లవ్ టుడే	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్, ఓ పాజిటివ్ 18 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 264 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


కశింకోటలోని ధ్యాన మందిరంలో వజ్ర కవచధారణతో వేంకటేశ్వరస్వామి

కశింకోట : మండలంలో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసి సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తూ ముగ్గులు వేశారు. ఇళ్లలో పొంగల్ వండి దేవుడు, పెద్దలకు నివేదించి పూజలు చేశారు. కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సాయంత్రం ఘనంగా తీర్థ మహోత్సవం జరిగింది. స్థానికులు వచ్చి తీర్థంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతా రామాచార్యులు, మారుతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయం నుంచి సర్వమంగళాంబ, త్రిపురాంతకస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారలను దర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వి. శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.లక్ష్మీ నృసింహస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను వరుసగా రెండోరోజు రథంపై ఊరేగించారు. భక్తులు దర్శించి పూజలు చేశారు. అర్చకులు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వజ్ర కవచాలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. సంక్రాంతి పురస్కరించుకొని వజ్ర కవచంతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేసి పూజలు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.


కోరుకొండపై భక్తుల రద్దీతోఉన్న శ్రీవీరన్నస్వామి ఆలయం


మండలంలో కోడూరు గ్రామంలో హరిదాసుతో ప్రజలు


వీవీ రమణ విగ్రహానికి పూలమాలలు వేసి తీర్థాన్ని ప్రారంభిస్తున్న విల్లూరి పైడారావు

అనకాపల్లిటౌన్ : పట్టణం, మండలంలో పలు ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. గవరపాలెం, వేల్పులవీధి, విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, శ్రీరామ్‌నగర్, శారదానగర్, నర్సింగరావుపేట, గాంధీనగరం, మండలంలో 32 పంచాయతీల్లో ప్రజలు ముంగిట ముత్యాల రంగవల్లికలు తీర్చి, గొబ్బెమ్మలు అమర్చి యువతులు సంప్రదాయ నృత్యాలు చేశారు. హరిదాసులు పట్టణంలో తిరుగుతూ సందడి చేశారు. పలు ప్రాంతాల్లో పండగను పురస్కరించుకుని నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

ఘనంగా వీరన్నస్వామి తీర్థం

తుమ్మపాల : మండలంలో చినమాకవరం గ్రామంలో కోరుకొండ శ్రీ వీరన్నస్వామి తీర్థం జరిగింది. మహాశివలింగ ఆకారంలో ఉన్న కొండపై వీరన్న ఆలయం తీర్థమహోత్సవాన్ని నాలుగు గ్రామాల పెద్దలు కమిటీగా ఏర్పడి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ తీర్థాన్ని ప్రతి ఏటా కనుమ రోజున నిర్వహించడం సంప్రదాయంగా వస్తుండడంతో ఈ ఏడాది యధావిధిగా ఏర్పాట్లు చేశారు. కొండపై ఉన్న నీటి కొలనులో నీటిని తాగి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండపైకి ఎటువంటి మెట్ల మార్గం లేకున్నా వీరన్న స్వామి దర్శనార్థం బండరాళ్లపై నుంచి సులభంగా చేరుకోగలుగుతున్నామని భక్తులు చెబుతున్నారు. సమీప గ్రామాలు మాకవరం, పెదమాకవరం, మార్టూరు, పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం నుంచి పూర్వం నుంచి ఆచరిస్తున్న పద్ధతి ప్రకారం గ్రామాల్లో భక్తులు రామ భజనలు చేసుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. కొండ దిగువన గల చినమాకవరం గ్రామంలో సాయంత్రం స్వామివారిని ఊరేగింపు చేశారు.

శీరంశెట్టివానిపాలెంలో.....

అక్కిరెడ్డిపాలెం పంచాయతీ శీరంశెట్టివానిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న ఉమా సమేత పంచముఖేశ్వర స్వామి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

బంగారయ్యపేటలో తీర్థం

కశింకోట : బంగారయ్యపేటలో సోమవారం తీర్థ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచదార చిలుకలు, ఖర్జూరం, తిను బండారాలను జోరుగా విక్రయించారు. వీటిని ఎక్కువగా కొనుగోలు చేశారు. ఉగ్గినపాలెంలో ఆది, సోమవారాల్లో తీర్థాలు జరిగాయి. ఇదిలా ఉండగా కన్నూరుపాలెం, అచ్చెర్ల గ్రామాల్లో మంగళవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

అనకాపల్లిటౌన్: పట్టణలో సుంకరమెట్ట జంక్షన్ వద్ద ముస్సిబ్ తీర్థం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీలో కామాక్షమ్మ తీర్థం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి కామాక్షమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చెపట్టారు. గ్రామ సర్పంచ్ సాలాపు శాంతి, సూరిఅప్పారావు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, తీర్థాన్ని తిలకించారు.

ఘనంగా వి.వి.రమణ తీర్థం

అనకాపల్లిటౌన్: గవరపాలెం చిన్నరామస్వామి దేవాలయం వద్ద సోమవారం స్వర్గీయ పార్లమెంట్ సభ్యుడు వి.వి.రమణ తీర్థం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు మాట్లాడుతూ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి ఎంతో మంది రైతులకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. గవర కులస్తులను బీసీ-డిలో చేర్చిన ఘనత వి.వి.రమణకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

22న తాళ్లపాలెం రాములవారి తీర్థం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో జరిగే అతి పెద్ద రాముల వారి తీర్థ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండల గ్రామాల్లో ఈ నెలాఖరువు వరకు తీర్థాలు జరుగుతాయి. వాటిలో ఇదే పెద్ద తీర్థం. మండల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో హాజరవుతారు. దీంతో ఇందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22న తీర్థం జరగనుంది. దీంతో ఇందుకు తీర్థం జరిగే ప్రాంతంలో ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు కర్రలతో అమరిక ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి రామాలయం వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రామాలయానికి చుట్టూ అందంగా విద్యుద్దీపాలంకరణ చేశారు. ఇది ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటుంది.


పట్టణంలో బాలికోన్నత హైస్కూల్ వద్ద ముగ్గువేసిన మహిళ


తారకరామారావు కాలనీలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వేస్తున్న చిన్నారులు


తాళ్లపాలెంలో రామాలయానికి అందంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ


తాళ్లపాలెంలో రాముల వారి తీర్థానికి ఏర్పాటు చేస్తున్న ముఖ ద్వారం

బుద్ధుడి విగ్రహావిష్కరణ


బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల మెయిన్‌రోడ్డు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన శాంతి ప్రదాత గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ సోమవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దంతులూరి దిలీప్ కుమార్, జబర్దస్త్ సత్తిపండు,ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, సర్పంచ్ తటా పెంటయ్యనాయుడు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలోవారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన బొజ్జనకొండకు వెళ్లే మార్గంలో మహనీయుడి విగ్రహం ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో ప్రయాణించాలంటూ బౌద్ధాన్ని స్వీకరించి ఆచరించి ప్రపంచానికి ఆయన ఆదర్శప్రాయుడయ్యారని చెప్పారు. ఇందులో గౌరీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ కర్రి బాబీ, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, కొణతాల శ్రీనివాసరావు,అడ్వకేట్ హరి శ్రీనివాసరావు, పీలా బుజ్జి, విశ్వేశ్వరరావు, పన్నీరు చంటి, ఆడారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘ నాయకులు

ఎస్.రాయవరం : ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్‌రావు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు వినతి పత్రం అందజేశారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద వివిధ దళిత సంఘాల పెద్దలతో వచ్చి ఎమ్మెల్యే కలిశారు. 2013 తీసుకు వచ్చిన చట్టం, 2023 తో ముగిస్తోందని, దానిని కొనసాగించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులపై ఆడిట్ చేయించాలన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ కాని ఎస్సీ సబ్ ప్లాన్ అమలుకు దళిత సంఘాల ఎన్జీవోలు కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ్ రావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు


ప్రథమ బహుమతి సాధించిన క్రీడాకారులను మెమెంటోతో సత్కరిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లిటౌన్ : క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించడంతోపాటు, శరీర ఆకృతి బాగుంటుందని సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోరిబిల్లి పరి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోర్ బౌండరీ క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో గెలిపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు.

బల్లాట నిర్వాహకుల అరెస్టు

కశింకోట : మండలంలోని జెట్టపురెడ్డితుని శివారులో బహిరంగంగా నగదు పణంగా పెట్టి డైస్ నాణాలతో బల్లాట ఆడుతున్న నలుగుర్ని సోమవారం తమ సిబ్బందితో వెళ్లి పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలో యలమంచిలి గణేష్, రాపేటి శ్రీనివాస్, యర్రా దుర్గాప్రసాద్, రాములున్నారన్నారు. వీరి నుంచి రూ.1783 నగదు, 6 డైస్ నాణాలు, ప్లాస్టిక్ నంబరింగ్ షీట్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఘనంగా రామగిరి తీర్థం


రామగిరి సీతారాముల సన్నిధిలో గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ తదితరులు

మునగపాక : మండలంలోని రామగిరి గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఏటా కనుమ పండుగ నాడు తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది కూడా కొండపై ఉన్న సీతారాములను దర్శించుకునేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, పక్కుర్తి బాబూరావు, పల్లా రాజు, పెంటకోట హరేరామ, దాసరి అప్పారావు, బుజ్జి సీతారాములను దర్శించుకున్నారు.

జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలకు విశేష స్పందన

మునగపాక : కనుమ పండుగ సందర్భంగా మునగపాకలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలకు విశేష స్పందన కనిపించింది. గ్రామానికి చెందిన విల్లూరి పద్మారావు,మహేష్‌ల జ్ఞాపకార్థం మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు డాన్ జిమ్ అధినేతలు పెంటకోట విజయ్, అజయ్ సోదరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రామన్నపాలేనికి చెందిన బోడమాంబిక గుర్రం ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఆర్‌ఆర్ పేటకు చెందిన దాడి కోటేశ్వరరావు, దేవరాపల్లికి చెందిన సాయి, రామన్నపాలెంకు చెందిన ధర్మిరెడ్డి అప్పారావుల గుర్రాలు ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు అందుకున్నాయి. కార్యక్రమంలో ఆడారి రాజు, శరగడం జగన్, బొడ్డేడ ప్రసాద్,దాడి నాయుడు,సాయి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షిరిడీసాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు కోరారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మునగపాక నందీశ్వర తులసీ కళావేదిక ప్రాంగణంలో ప్రవాస మిత్ర ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన అదే రోజు రాత్రి బహుమతులు అందజేశారు. నిర్వాహకులు వెలగా నరసింగరావు, పెంటకోట వెంకట్, గిరిబాబు, మళ్ల జోగారావు, దొడ్డి శ్రీహరిప్రియ, భరణి, పెంటకోట జగ్గు, ఆడారి సూర్యచంద్రరావు, ఆడారి రమణబాబు, సూరిశెట్టి సుధారాణి పాల్గొన్నారు.

దిగుబడి భేష్


తుమ్మపాలలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు


పంటకోత ప్రయోగంలో దిగుబడులు లెక్కిస్తున్న వ్యవసాయధికారులు

- పంటకోత ప్రయోగాల్లో ఆశాజనకంగా ఫలితాలు
- గతేడాది ఎకరానికి 25-27 బస్తాల దిగుబడి
- ఈసారి 27 నుంచి 29 బస్తాలు వచ్చే అవకాశం
- మండలంలో ఇప్పటివరకు 64 పంటకోత ప్రయోగాలు పూర్తి
- ప్రతికూల పరిస్థితుల్లోనూ రైతులకు ఊరట

అనకాపల్లి రూరల్ : ప్రకృతి విపత్తులు వరి రైతుపై ప్రతాపం చూపాయి. భారీ వర్షాలు పంటకు నష్టం కలిగించాయి. పంట వేసిన దగ్గరి నుంచి కోతకు వచ్చే వరకూ అన్నదాత కలవరపడుతూనే ఉన్నాడు. అయినా వస్తున్న దిగుబడితో అన్నదాతలో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లోనూ పంటకోత ప్రయోగాల్లో ఎకరానికి 27 నుంచి 29 బస్తాలు దిగుబడి వస్తుండడం విశేషం. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ప్రకృతి అనుకూలించడం..సకాలంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సరఫరా చేయడం...పెట్టుబడికి ముందస్తుగా రైతు భరోసా పథకం కింద సాయం చేయడంతో పంటల సాగు ఆశాజనకంగా జరిగింది.

అనకాపల్లి మండలంలో ఈ ఏడాది దాదాపు 12వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో వరి కోతలు పూర్తి స్థాయిలో ముగుస్తాయి. స్థానిక అవసరాలకు పోగా మిగతా ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరిస్తోంది. ఈసారి ధాన్యం సేకరణలో కొత్త విధానాన్ని అమలు చేస్తూ రైతుకు ఇబ్బంది లేకుండా యంత్రాంగాన్ని సిద్ధం చేసింది.

64 పంటకోత ప్రయోగాలు పూర్తి

ఏయే ప్రాంతాల్లో దిగుబడులు ఎలా ఉన్నాయో అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు పంటకోత ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లి మండలంలో ఇప్పటివరకు 64 చోట్ల వరి పొలాల్లో పంటకోత ప్రయోగాలు పూర్తి చేశారు. మండల వ్యవసాయాధికారి(ఏవో), మండల వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)లతో పాటు రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకె) సిబ్బంది సమక్షంలో ఈ పంటకోత ప్రయోగాలు చేపడుతున్నారు. ఇప్పటికే పూర్తి చెసిన ప్రయోగాల్లో ఆశించినమేర దిగుబడులు నమోదవుతుండడంతో రైతన్నలు సంతోషపడుతున్నారు. మరికొద్ది రోజులు వాతావరణం సహకరిస్తే ప్రధాన పంట చేతికందుతుందని రైతులు చెబుతున్నారు.వరి చివరి దశలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ఆది నుంచి అనుకూల పవనాలు వీచాయి. ఏపుగా పెరగడంతో మంచి దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంటకోత ప్రయోగాల్లో ఎకరానికి 1980 నుంచి 2040 కేజీల వరకు దిగుబడి నమోదవుతోంది.ఎకరానికి 75 కిలోల బస్తాలు 27 నుంచి 29 బస్తాలు వరకూ వస్తున్నాయి. కొన్ని చోట్ల 30 బస్తాల వరకూ దిగుబడి వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. గత ఏడాది కంటే ఈ సారి దిగుబడులు మెరుగ్గా ఉన్నాయని రైతులు భావిస్తున్నారు.

లక్ష్యం మేరకు ప్రయోగాలు చేస్తాం



ఇప్పటివరకూ నిర్వహించిన పంటకోత ప్రయోగాల్లో దిగుబడులు బాగానే వస్తున్నాయి. ఎకరానికి 27 నుంచి 29 బస్తాల వరకూ వస్తోంది. ఈ ఏడాది సాగుకు అనుకూల వాతావరణం ఉండడంతో అంతా కలిసివచ్చింది. ఇప్పటికే 64 పంటకోత ప్రయోగాలు పూర్తి చేశాం. లక్ష్యం మేరకు ప్రయోగాలు చేస్తాం.

-పియుటిపి రంగాచారి, వ్యవసాయాధికారి,అనకాపల్లి

ఘనంగా సోమేశ్వరస్వామి తీర్థ మహోత్సవాలు


పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఎడ్లబళ్లు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో సోమలింగపాలెం గ్రామంలో జిల్లా స్థాయి ఎడ్లబండి పోటీలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినం-కనుమ పండగ సందర్భంగా సోమేశ్వరస్వామి తీర్థమహోత్సవం పురస్కరించుకుని గ్రామంలో జరిగిన ఈ జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలలో 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కర్రి శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో చోడవరం మండలానికి చెందిన నర్సాపురం జట్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకోగా, నీలకంఠాపురం తృతీయ బహుమతి మరియు మెట్టపాలెం గ్రామం జట్టు నాలుగో బహుమతులు గెలుచుకున్నాయి. ఈ పోటీలకు ఆర్థిక సహాయం మాజీ కౌన్సిలర్ యల్లపు గోపి వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లపు త్రినాథ్, కర్రి నాయుడు, బొడ్డేడ శ్రీను, కర్రి స్వామి, గౌరి యూత్ తదితరులు అందించారు.